# ప్రశ్నలు & సమాధానాలు
# ప్రశ్న 318: సత్యం - ధర్మం - పరిణామం
# మే 4, 2024

ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 2, పేజీలు 291-295 నుండి తీసికొనబడినవి

స్వామి! పూర్వీకులు సత్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు, కానీ ఈ కాలంలో అలాగ ఉండడం లేదు. సత్యం అంత ముఖ్యమా?

భగవాన్: జీవితంలోని అన్ని విలువలలోకి అతి ముఖ్యమైనది సత్యం. సత్యాన్నాస్తి పరో ధర్మః. అన్నిటికీ సత్యమే మూలం. భగవంతుడు సత్యం. ప్రకృతి అంతయూ ఆ సత్యం నుండే ఉద్భవించినది. మళ్ళీ సత్యం లోనే ప్రళయమౌతుంది.

సత్యమునందుండి సర్వంబు సృష్టించె
సత్యమునణగె సర్వ సృష్టి
సత్య మహిమ లేని స్థలమేది కనుగొన్నా
శుద్ధ సత్యమదియే చూడరయ్యా

కనుక, దేవుడే సత్యం, సత్యమే దేవుడు. సత్యములో జీవించు. సత్యమే ధర్మానికి మూలం, శాంతికి మార్గం, మన జీవితం ప్రేమ మయం అవడానికి కారణం.

హరిశ్చంద్రుని చరిత్రను ఈ నాటికీ గుర్తు చేసుకుంటారు ఎందుకు? సత్యం కొరకు అతను భార్య, కొడుకు, రాజ్యం, అన్నిటినీ త్యాగం చేసాడు.

ప్రహ్లాదుడు రాజుగా పరిపాలించే కాలంలో ఒక రోజు ఒక అందమైన స్త్రీ అంతఃపురం విడిచి వెళ్ళడం చూసాడు. "మీరెవరు?" అని అడిగాడు. "నేను నీ శీలం," అని జవాబు చెప్పింది ఆమె. ప్రహ్లాదుడు ఏమి మాట్లాడలేదు. మరుసటి రోజు ఇంకొక అందమైన స్త్రీ అంతఃపురం విడిచి వెళ్ళడం చూసాడు. మీరెవరని ఆమెను అడిగితే "నేను నీ రాజ్యలక్ష్మిని," అని జవాబు చెప్పింది. ఆ మరుసటి రోజు ఇంకొక సౌందర్యరాశి అంతఃపురం విడచి వెళ్ళడం చూసాడు. ఆమెను అడిగాడు, "అమ్మా, మీరెవరు?" అని. "నేను నీ యశస్సుని," అని చెప్పింది. ఆమెను కూడా అడ్డుపెట్టలేదు.

మరుసటి రోజు ఎప్పుడూ చూడనంత అందమైన స్త్రీ అంతఃపురం విడిచి వెళ్ళడం చూసాడు. గౌరవంతో, ఎంతో మృదువుగా ఆమెను అడిగాడు, "అమ్మా, మీరెవరు?" అని. "నేను సత్యం," అని చెప్పింది. వెంటనే ప్రహ్లాదుడు ఆమె పాదాలపై పడి ఆమెను వెళ్ళ వద్దని వేడుకున్నాడు. చివరికి ఆమె అంతఃపురం విడిచి వెళ్లనని ఒప్పుకుంది. అప్పుడేమైంది? శీలం, రాజ్యం, యశస్సు అందరూ కూడా ఆమె వెంట అంతఃపురం లోనికి అనుసరించారు. అంటే సత్యం ఒక్కటి ఉంటే మిగిలినవన్నీ అవే వస్తాయి!

స్వామి! మాకు ధర్మం అంటే ఏమిటో సరి అయిన అవగాహన లేదు. అందుచేత మాకుండే కొద్దిపాటి జ్ఞానంతో సరి అయిన మార్గంలో నడవ లేక పోతున్నాము. పండితులు ధర్మం గురించి అనేక విధాలుగా బోధిస్తుంటారు.

ఒక సందర్భంలో ధర్మం గురించి ఒకలాగా బోధిస్తారు, మరో సందర్భంలో మరో విధంగా బోధిస్తారు. దయచేసి ధర్మం గురించి చెప్పండి స్వామి!

భగవాన్: మన పెద్దవాళ్ళు, పండితులు ధర్మం గురించి చెప్పినవి సరిగ్గా అర్థం చేసుకోవాలి. తొందరలో అవి అన్నీ విరుద్ధంగా భావించకూడదు.

ఉదాహరణకు, సత్యాన్నాస్తి పరో ధర్మః అనే సూక్తిలో ఏమి అర్థం చేసుకోవాలి? సత్యం కంటే ఉన్నతమైన ధర్మం మరొకటి లేదు అని అర్థం. దీని అంతరార్థం ఏమంటే ధర్మానికి మూలం సత్యం.

అహింసా పరమో ధర్మః అని ఇంకొక సూక్తిని తీసుకోండి. అంటే ఏమి అర్థం? ఇంతకు మునుపే సత్యమే ధర్మానికి మూలం అన్నారు. ఇప్పుడు అహింసయే అత్యోన్నత ధర్మం అంటున్నారు. ఇక్కడ అహింస అంటే హింస చేయకపోవడం ఒక్కటే కాదు. ఎవ్వరినీ మన మాటలతో, కర్మలతో, భావములతో హాని చేయకూడదు. ఇక్కడ సత్యమును పరోక్షముగా చూస్తున్నాము. సత్యమునకు భయము, క్రోధము రెండూ ఉండవు. సత్యాగ్రహం అనే సమస్తపదములో అర్థం సత్యం ఎక్కడ ఉందో క్రోధం అక్కడ ఉండదు అని. సత్యం హాని చేయదు. సత్యమును మూలంగా భావించువాడు హింస చేయలేడు. వాడు అహింసను తన ధర్మంగా భావిస్తాడు.

అదే విధంగా, వేదోఖిలో ధర్మమూలం అన్నారు. యజ్ఞ యాగాది కృతులను వివరించే వేదాలు వాటిని ఆచరించే విధానములను ధర్మంగా భావిస్తాయి. ఆ వేదాలు విధించిన కర్మలను జరిపించడం మన కర్తవ్యం. ఇక్కడ ధర్మం అంటే కర్తవ్యంగా భావించాలి. మన కర్తవ్యమును ఆచరించి మన బాధ్యతలను నెరవేర్చాలి. అందుచేత కర్తవ్యం యోగ ఉచ్యతే అన్నారు.

భగవద్గీతలోని స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః అనే శ్లోకంలో 'స్వధర్మ' అనగా 'ఆత్మ ధర్మ' అని అర్థం చేసుకోవాలి. కానీ నాలుగు వర్ణాలు, నాలుగు ఆశ్రమాలకు సంబంధించిన ధర్మములు వారి జన్మకు సంబంధించినవి. ప్రపంచములో నలుపు, తెలుపు, ఎరుపు, పసుపు, గోధుమ, ఇలా రకరకాల రంగుల ప్రజలు అన్ని దేశాలలోనూ ఉంటారు.

బ్రహ్మచర్య, గృహస్థ్య, వానప్రస్థ, సన్న్యాస అనే నాలుగు ఆశ్రమములు సాధనలోని నాలుగు మెట్ల వలె భావించి, ఆయా కర్తవ్యములను నిర్వర్తించి, బ్రహ్మమును చేరుకోవాలి.

కనుక ధర్మమనేది అతి సూక్ష్మమైనది. సత్యంలోని ప్రాణం మాటలో ఉంటే ధర్మములోని ప్రాణం కర్మలలో ఉన్నది.

స్వామి! మానవునిలో పరిణామం ఎలా వస్తుంది?

భగవాన్: మానవునిలో పరిణామం రావాలంటే మనసులో పరిణామం రావాలి. హృదయంలో మార్పు రావాలనుకుంటారు, అది పొరపాటు. హృదయమనేది ఛాతీలో ఎడమ భాగంలో ఉండే భౌతికమైన గుండె కాదు. ఆధ్యాత్మిక హృదయం పేరు, అది అంతా వ్యాప్తించి ఉంటుంది. ఇదే సత్, దీనిలో మార్పు ఉండదు. మనసు ఉండడం వలన మానవుడు అనబడిన వాడిలో మనసులో మార్పు రావడం అత్యంత ముఖ్యం. జీవి మరణించిన తర్వాత కూడా మనసు సజీవంగానే ఉంటుంది. అందువలనే అంటారు:

మన ఏవ మనుష్యాణాం
కారణం బంధ మోక్షయో:

మనసు ఒక్కటే మానవుని బంధానికి, మోక్షానికి కారణం. మనసు ప్రవృత్తి మార్గంలో ప్రవేశిస్తే వాంఛలు, భావాలు, సంసార విషయాలలో మునిగిపోతుంది. అదే నివృత్తి మార్గంలో ప్రవేశిస్తే ఇవన్నీ అణగిపోతాయి. దీనినే అమనస్కం అంటారు. దీని వలన శాంతి సంతోషాలు లభిస్తాయి. మనసు పరివర్తన చెందడం అంటే ఇదే. అప్పుడే మానవునిలో పరిణామం వస్తుంది.

స్వామి! కర్మ, భక్తి, జ్ఞానమనే మూడు మార్గములను ఎలా అర్థం చేసుకోవాలి?

భగవాన్: మీ చేతిన ఉండే watchని చూడండి. ప్రతి watchలో సెకనులు, నిమిషములు, గంటలు చూపించే మూడు ముల్లులు ఉంటాయి. సెకనుల ముల్లు 60 సార్లు తిరిగితే కానీ ఒక నిమిషం అవదు. నిమిషముల ముల్లు 60 సార్లు తిరిగితే కానీ ఒక గంట అవదు. ఇక్కడ సెకనుల ముల్లు కర్మ మార్గం. నిమిషముల ముల్లు భక్తి మార్గం. గంటల ముల్లు జ్ఞాన మార్గం.

ఇంకొక ఉదాహరణ ఇస్తాను. మీకు సెలవలు ఇచ్చినప్పుడు చాలా మంది ట్రైనులో ఇంటికి వెళ్తారు. మూడు రకాల ట్రైన్లు ఉంటాయి. ఎక్స్ప్రెస్ ట్రైనులో ఎక్కితే నేరుగా గమ్యానికి చేరతారు. ఇంకొక రకం ట్రైనులో కోచ్ లో కూర్చుంటే జంక్షన్ వచ్చినప్పుడు ఆ భోగీని మరో ట్రైనుకు తగిలిస్తారు, అప్పుడు అది మీ గమ్యానికి చేరుస్తుంది. మీరు ఎక్కడా దిగక్కర లేదు.
ఈ రెండూ కాక ఇంకో మార్గముంది. ప్యాసెంజర్ ట్రైనులో ఎక్కితే కొంత దూరం ప్రయాణించిన తర్వాత జంక్షన్ లో దిగి మళ్ళీ ఇంకోక ట్రైను పట్టుకొని మీ గమ్యానికి చేరుకోవాలి.

ఈ మూడు మార్గములు ఆధ్యాత్మిక ప్రయాణములోని మార్గముల వంటివి. ప్యాసెంజర్ ట్రైన్ కర్మ మార్గము వంటిది. కోచ్ లో కూర్చొని ఎక్కడా దిగక్కరలేకుండా భోగీ మారి గమ్యం చేరుకోసేది భక్తి మార్గం. ఎక్స్ప్రెస్ ట్రైన్ గమ్యానికి నేరుగా తీసుకెళ్ళే జ్ఞాన మార్గము వంటిది.

వచ్చే వారము మరిన్ని సందేహాలను స్వామి స్పష్టపరుస్తారు. ధన్యవాదములు.

ఓం సాయి రామ్